
ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబరు, 2025 5 శ్రీకాకుళం



మైనారిటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యాన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల మైనారిటీ అభ్యర్థులకు (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన) ఎస్ఐ, కానిస్టేబుల్, టెట్, డిఎస్సి ఉద్యోగాల కోసం ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.కుమారస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీస్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ప్రోగ్రామ్ ద్వారా నిపుణులతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు http://apced-mmwd.org వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేసుకుని, దరఖాస్తును సిఇడిఎం కార్యాలయం, భవానీపురం, విజయవాడ 520012' చిరునామాకు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 0866-2970567 ఫోన్ నంబరును సంప్రదించవచ్చని తెలిపారు.



నందిగాం మండలంలో నేలమట్టమైన వరి పంట

ఈ ఏడాది ఖరీఫ్ అంతా ఒడిదుడుకుల మధ్యే సాగింది. జూన్, జూలైలో తగినంత వర్షాల్లేక అన్నదాతలు ఇబ్బందులు పడ్డారు. వర్షాభావ పరిస్థితుల నుంచి ఏదోరకంగా నెట్టుకొచ్చిన రైతులకు మొంథా తుపాను తీవ్ర నష్టాన్ని తెచ్చి పెట్టింది. సరిగ్గా పంట చేతికొచ్చిన సమయానికి నాలుగు రోజులుగా కురిసిన వర్షాలు రైతులకు గుండెకోతను మిగిల్చాయి. తుపాను ప్రభావంతో గురువారమూ పలుచోట్ల మోస్తరు వానలు పడడంతో రైతులు తేరుకోలేకపోతున్నారు. పొలాలు ఇంకా ముంపుబారిలోనే ఉన్నాయి. వరి చేలు నీటిలో నానుతుండడంతో ధాన్యం రంగు మారే ప్రమాదం ఉండడంతో ఏం చేయాలో రైతులకు దిక్కుతోచడం లేదు.

రైతు కంట కన్నీరు

- నాలుగు రోజులుగా నీటిలోనే వరి చేలు
- జిల్లాలో పలుచోట్ల మోస్తరు వర్షాలు
- ధాన్యం రంగు మారే అవకాశం ఉండడంతో ఆందోళన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, లావేరు

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సాగుకు కొంత గడ్డు పరిస్థితులు నెలకొన్నా ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబరులో పలుదఫాలుగా సంభవించిన అల్పపీడనాలతో పంటల సాగు కాస్త బాగానే సాగింది. ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4 లక్షల 7 వేల 488 ఎకరాల్లో రైతులు సాగు చేస్తారని అంచనా వేయగా, 4 లక్షల 2 వేల 600 ఎకరాల్లో పంటలు వేయగలిగారు. వరి పంట సాగు లక్ష్యం 3,76,773 ఎకరాలు కాగా 3,69,304 ఎకరాల్లో సాగు అయింది. మొక్కజొన్న కూడా సుమారు 87 శాతం మేర సాగైంది. పంట చేతికొస్తున్న సమయంలో మొంథా తుపాను రైతులను నిండా ముంచింది.

నాలుగు రోజులుగా నీటిలోనే వరి చేలు

తుపాను ప్రభావంతో జిల్లాలో సుమారు 5,582.98 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. అందులో జిల్లాలో వరి పంటకు సంబంధించి 4,801 మంది రైతులకు చెందిన 5,568.75 ఎకరాల్లో వరి పంట దెబ్బతింది. జిల్లాలో 13 మండలాల పరిధిలోని 120 గ్రామాల్లో పంట నష్టం సంభవించినట్లు అధికారులు గుర్తించారు. పత్తి పంట సుమారు 13 ఎకరాల్లో దెబ్బతింది. ఇచ్ఛాపురం, పాతపట్నం, నందిగాం, వజ్రపుకొత్తూరు, ఎచ్చెర్ల మండలాల్లో వరి, కొత్తూరు మండలంలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. తుపాను, ఈదురుగాలుల కారణంగా ఉద్యాన పంటలకు 14.23 ఎకరాల మేర నష్టం వాటిల్లింది. అందులో 28 ఎకరాల్లో జీడి, 1.12 ఎకరాల్లో అరటి, ఎకరా విస్తీర్ణంలో బొప్పాయి, ఐదు ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం సంభవించింది.



లావేరు మండలంలో దెబ్బతిన్న పత్తి పంట

ధాన్యం రంగు మారే అవకాశం!

నాలుగు రోజులుగా వరి చేలు నీటిలోనే నానుతుండటంతో రంగు మారే ప్రమాదముండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వరి పంట సుమారు 5,583 ఎకరాల్లో నీట మునగడంతో ధాన్యం రంగు, తేమ శాతంపై ప్రభావం చూపే అవకాశముందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం మునిగిన పంట మేరకు సుమారు లక్ష క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ముందని అధికారులు భావిస్తున్నారు. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు తేమ శాతంలో సడలింపు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

పంట అంతా తుడిచిపెట్టుకుపోయింది



నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. ఎకరాకు రూ.25 వేలు పెట్టుబడి అయింది. రూ.50 వేలు అప్పు చేసి పెట్టుబడులు పెట్టాను. ఎకరాకు 30 బస్తాలు దిగుబడి వచ్చేది. పొట్ట దశలో తుపాను వచ్చి మొత్తం తుడిచిపెట్టుకుని పోయింది. మొత్తం వరి నేలమట్టమైంది. అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- చొక్కాకుల గొల్లారావు, ఇజ్జుపేట, లావేరు

తుపాను మా పొట్ట కొట్టింది



నేడు మూడు ఎకరాల్లో మొక్కజొన్న వేశాను. పెట్టుబడి రూ.70 వేలకు పైగా అయింది. పంట దిగుబడులు, ధర లేకపోయినా పంట ఖర్చులైనా వస్తాయని అనుకున్నాను. నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు మొలకలు వచ్చి రంగు మారిపోయింది. రంగు మారిపోవడంతో వ్యాపారులు వారి ఇష్టమొచ్చిన ధరకు అడుగుతున్నారు.

- ఇజ్జు రమణ, కేశవరాయపురం, లావేరు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన రద్దు చేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్
- 18న ఆర్‌డిఒ కార్యాలయం వద్ద మహా ధర్నా

ప్రజాశక్తి - పలాస

కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ డిమాండ్ చేసింది. కార్గో ఎయిర్‌పోర్టు ప్రతిపాదనను రద్దు చేయాలని, బలవంతపు భూసేకరణ ఆపాలని నవంబరు 18వ తేదీన పలాస ఆర్‌డిఒ కార్యాలయం చేపట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. స్థానిక కళ్యాణ మండపంలో పోరాట కమిటీ అధ్యక్షులు కొమర వాసు అధ్యక్షతన గురువారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ, న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శులు ఎల్.వెంకటరావు, వంకల మాధవరావు, పోరాట కమిటీ కార్యదర్శి జోగి అప్పారావు మాట్లాడుతూ కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో ప్రజల ఆస్తులను కార్పొరేట్ ఆస్తులుగా మార్చడమే అభివృద్ధా అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ప్రశ్నించారు. తుపానులో ప్రజలు బిక్కుబిక్కుమని బతుకుతుండగా, మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం రహస్యంగా సర్వేల కోసం గ్రామాలకు రావడాన్ని తీవ్రంగా ఖండించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయలేని, జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం కోసం కనీసం రూ.ఆరు కోట్లు తెచ్చుకోలేని వాళ్లు, జిల్లాలో రోడ్లు బాగు చేయలేని వాళ్లు, కిడ్నీ వ్యాధితో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకోలేకపోయిన వాళ్లు జిల్లా అభివృద్ధి కోసం మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామని, జీడికి గిట్టుబాటు ధర కల్పిస్తామని, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని, నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ఇచ్చిన ఒక్క వాగ్దానం కూడా అమలు చేయలేని వారు ఉద్యోగాలు ఇస్తామని, అభివృద్ధి చేస్తామని చెప్పడం ప్రజలను మోసం చేయడానికి పూనుకోవడం కాదా అని మంత్రి రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో లక్షలాది చెట్లు నరికేయడం వల్ల పర్యావరణపరంగా శ్రీకాకుళం జిల్లాకు పెనుముప్పు ఏర్పడదా అని ప్రశ్నించారు. జీడి ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేస్తే వాటి వల్ల సుమారు ప్రత్యక్షంగా, పరోక్షంగా 40 వేల మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. దేశంలో ఎక్కడైనా ప్రత్యేకంగా కార్గో ఎయిర్‌పోర్టు ఉందా అని ప్రశ్నించారు కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా ప్రజల మద్దతుతో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుసంఘం జిల్లా కన్వీనర్ టి.అజయ్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు మద్దిలి రామారావు, ఎన్.గణపతి, కె.శ్రీనివాస్, ఎం.రామారావు, పి.దుర్యోధన, కె.బాలాజీరావు, పోరాట కమిటీ నాయకులు బత్తిని లక్ష్మణరావు, లండ రామస్వామి, గుంటు లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమల్లో నిర్లక్ష్యం వద్దు

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



సమీక్షిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అధికారులు, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. గత సమావేశంలో అడిగిన కీలక గణాంకాలు సమర్పించకపోవడంపై జిల్లా వైద్య ఆరోగ్యాధికారి కార్యాలయ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూలై నుంచి నమోదైన గర్భిణులు, గర్భస్రావాల వివరాలపై సమీక్షించారు. జిల్లాలో మొత్తం 130 స్కానింగ్ యంత్రాలు ఉండగా, వీటిలో 101 ప్రైవేట్, 29 ప్రభుత్వ కేంద్రాలుగా ఉన్నాయని అధికారులు వివరించారు. అన్ని కేంద్రాల్లో సిసి కెమెరాలు ఉన్నా... రికార్డులు సరైనవిగా ఉన్నంత మాత్రాన చట్టం అమలైందను కోలేమని, వాస్తవ పరిస్థితులు తెలుసుకోవడానికి క్షేత్ర స్థాయిలో తనిఖీలు ఎప్పటికప్పుడు తప్పనిసరని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో అందుతున్న వైద్యసేవలు, లింగ నిర్ధారణ పరీక్షలు, మాతా శిశు మరణాలు వంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్‌కుమార్, అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి అనిత, కమిటీ కన్వీనర్ డాక్టర్ శ్రీకాంత్, డిఐఒ డాక్టర్ రామదాస్, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్‌బాబు, విశ్రాంత జడ్జి పప్పల జగన్నాథరావు, సామాజిక కార్యకర్త ఎం.వెంకటస్వామి, డాక్టర్ ధానేటి శ్రీధర్, బెజ్జిపురం యూత్ క్లబ్ నుంచి ప్రసాదరావు పాల్గొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో...

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ చర్యలపై సమీక్షించారు. రోగులు, సిబ్బంది, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రులు రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల కోడింగ్ బ్యాగులు ఉపయోగించి ఇంజక్షన్ సూదులు, పత్తి, గ్లౌవ్స్, శరీర వ్యర్థాలు వంటి బయోమెడికల్ వ్యర్థాలను తప్పనిసరిగా వేరు చేయాలని సూచించారు. బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్‌లో రోజూ తప్పనిసరిగా ఎంటర్ చేయాలని స్పష్టం చేశారు. డేటా ఎంట్రీ చేయని సంస్థలపై కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేవంలో ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కరుణశ్రీ, డిఎంహెచ్ఒ అనిత, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎస్‌పి మహేశ్వరరెడ్డి



రక్తదానం చేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి అన్నారు. అమరవీరుల స్మారకోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ప్రారంభించిన ఎస్‌పి రక్తదానం చేశారు. వంద మంది వరకు పోలీసులు రక్తదానం చేశారు. 200 మంది పోలీసులకు వైద్య శిబిరంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ఉచిత వైద్య, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుతమైనవి, ఒత్తిడితో కూడుకున్నవి కావడంతో సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతిఒక్కరూ సంవత్సరానికి కనీసం ఒకసారి రక్తదానం చేసి సమాజంలో సేవా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో వైద్య శిబిరంలో సేవలు అందించారు. రక్తపోటు, షుగర్, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రెడ్‌క్రాస్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంలో రక్తం సేకరించారు. రెడ్‌క్రాస్ అందజేసిన ప్రశంసాపత్రాలను రక్తదానం చేసిన వారికి ఎస్‌పి ప్రదానం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, పోలీసు యూనిట్ డాక్టర్ సిహెచ్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలే లక్ష్యం



మాట్లాడుతున్న అవినాష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా సహకార మార్కెటింగ్‌శాఖ ద్వారా మెరుగైన సేవలే లక్ష్యమనిజిల్లా డిసిఎంఎస్ అధ్యక్షులు చౌదిరి అవినాష్ తెలిపారు. జిల్లా సహకార మార్కెటింగ్ కార్యాలయంలో ప్రజా సేవలో డిసిఎంఎస్ అన్న అంశంపై గురువారం వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారదర్శక సేవలు లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. పాఠశాలలకు, వసతి గృహాలకు, ప్రభుత్వ సంస్థలకు నాణ్యమైన వస్తు సామగ్రి, స్టేషనరీ అందజేయడమే లక్ష్యమని చెప్పారు. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలన్నారు. రైతులకు అవసరం మేరకు ఎరువులు అందించడం లక్ష్యంగా చెప్పారు. వ్యవసాయ పనిముట్లు, పశువుల దాణా, టార్పాలిన్లు రాయితీపై అమ్మకం వంటి చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజలు సంతృప్తి పొందేలా సేవలు ఉండాలన్నారు. రైతులు సమస్యలు, అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆపరేటివ్ అధికారి బి.మురళీకృష్ణ, అధికారులు కె.దామోదరరావు, మార్పు జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి



భీమారావు మృతదేహం

ప్రజాశక్తి - సంతబొమ్మాళి

చేపల వేటకు వెళ్లిన మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల భీమారావు (55) చేపల వల కాళ్లకు చిక్కుకుని నీటిలో మునిగి గురువారం మతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సీతానగరం సమీపంలోని పల్లం కాణా వద్ద భీమారావు ఎప్పటిలాగే చేపల కోసం వల వేశాడు. అదే వల ఆయన కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో చిక్కుకుపోయాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎంత ప్రయత్నించినా బయటకు రాలేక మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న నౌపడ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆయన భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే భీమారావు మరణ వార్త సీతానగరం గ్రామంలో విషాదఛాయలు నింపింది.

త్వరితగతిన కేసుల దర్యాప్తు

- పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ కేసులపై ప్రత్యేక దృష్టి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పెండింగ్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ కేసుల దర్యాప్తులో పారదర్శకత, వేగానికి ప్రాధాన్యమిచ్చి ప్రతి కేసు దశల వారీగా పర్యవేక్షించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాల సాధన కీలకమైన దశ అని, ప్రతి పోలీసు అధికారి వృత్తిపరమైన నిబద్ధతతో, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. సాక్ష్యాలను శాస్త్రీయంగా సేకరించి, ఛార్జిషీట్లు సమయానికి దాఖలు చేయాలన్నారు. కోర్టులో సరైన ఆధారాలతో దర్యాప్తు పత్రాలు సిద్ధం చేయాలన్నారు. ప్రాధాన్యత కేసులు త్వరితగతిన విచారణకు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. రాత్రివేళలో పకడ్బందీగా విధులు నిర్వర్తించి కొత్త, అనుమానిత వ్యక్తులు తారసపడితే వివరాలను ఆరా తీయాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టి కేంద్రీకరించి ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్‌పిలు కె.వి రమణ, పి.శ్రీనివాసరావు, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, లక్ష్మణరావు పరిపాలన అధికారి సిహెచ్.గోపీనాథ్, సిఐ ఇమ్మాన్యుయేల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బందికి ప్రశంసలు

విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్‌పి అభినందించి, ప్రశంస పత్రాలు అందజేశారు. సమీక్ష అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కేసుల దర్యాప్తులో వేగం, నాణ్యతతో పాటు ప్రాపర్టీ కేసుల ఛేదనలో విశేష ఫలితాలు సాధించిన అధికారులను అభినందించారు. అలాగే నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, ఉన్నత అధికారుల పర్యటనల సమయంలో గార్డు ఆఫ్ హానర్ విధుల్లో క్రమశిక్షణతో వ్యవహరించడం, వార్షిక తనిఖీల్లో ఆయుధాల సక్రమ నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన పోలీసు సిబ్బందిని ప్రశంసించారు. జిల్లా పోలీసు సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన, సమర్థతతో పనిచేస్తేనే ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో ప్రతి పోలీసు అధికారి నిబద్ధత, చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు.


మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీకాంత్

కొలిక్కిరాని చాపరాయి పంచాయితీ

ప్రజాశక్తి- మందస

మండలంలో గత కొద్ది రోజులుగా చోటు చేసుకున్న చాపరాయి భూముల వ్యవహారం పంచాయితీ కొలిక్కిరాలేదు. చాపరాయికి చెందిన జయరాజు, మాధవరావుల భూమిని కొనుగోలు చేసినట్లు ఎస్ఒఆర్ కాపీలను సైతం మా దగ్గర పూర్తిగా ఆధారాలతో ఉన్నాయని, గిరిజనేతరులు సుదర్శన్ యాదవ్ మిస్ తహశీల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు ఇరువురితో తహశీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. అనంతరం గిరిజన సంఘ నాయకులు మాట్లాడుతూ 1992 నుంచి కొనుగోలు, అమ్మకాలు చేపట్టలేదని అన్నారు. అప్పటి సర్వేయరు నడిపించాడని అన్నారు. గిరిజనేతురులు సుదర్శన్ యాదవ్ అన్ని ఆధారాలతో ఉన్నా... ఎటువంటి ఆధారాలు లేని జయరాజు, మాధవరావులు ఆధారాలు లేవని అన్నారు. గిరిజనులమని చెప్పుకుంటున్నారని అన్నారు. తహశీల్దార్ జోక్యం చేసుకుని ఎస్ఒఆర్ కాపీలను తెప్పించుకొని నిజనిర్ధారణను నిగ్గు తేలుస్తామని నచ్చజెప్పారు.

అధ్వానంగా దేవరాపల్లి రోడ్డు

- గుంతల రహదారితో అవస్థలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి మీదుగా పెద్దనడిపల్లి వెళ్లే రోడ్డు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై గుంతలతో నానా అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా ఆ గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కమ్మసిగడాం నుంచి దేవరాపల్లి మీదుగా పెద్దనడిపల్లి వెళ్లే రోడ్డు పెద్దపెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. వర్షం కురిసినప్పుడు ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. రోడ్లపై ఉన్న గుంతలను కనీసం పూడ్చకపోవడంతో వర్షం కురిసినప్పుడు ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలు పూడ్చకపోవడం, మార్జిన్లు పెంచకపోవడవంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందని రోడ్డులో ప్రయాణించేవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఈరోడ్డుపై ప్రయాణం చేసే వాహనాలు కూడా ఆరు మాసాలకే మరమ్మతులకు గురై మూలకు చేరుతున్నాయని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కనీసం గుంతలైనా పూడ్చాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నిస్తున్నారు. అధికారులు కనీసం గుంతలను కూడా పూడ్చలేదు. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనతో రోడ్లపై ప్రయాణిస్తున్నామని వాపోతున్నారు. ఎన్నికల ప్రచారంలో రాజకీయ నాయకులు దేవరాపల్లి రోడ్డును తారురోడ్డు వేస్తామని హామీలు ఇస్తున్నారుగాని అధికారంలోకి వచ్చాక హామీలు మరచి పోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేసేలా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రహదారిపై గుంతలు


పొందూరు: పొందూరు - చిలకపాలెం రహదారిలో కృష్ణాపురం సమీపంలో రహదారిపై ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి. ఈ ప్రాంతంలో స్టోన్‌క్రషర్లు ఉండడంతో నిత్యం వాహనాల రాకపోకలతో గుంతలు ఏర్పడ్డాయి. అంతేకాకుండా ఇక్కడి సమీపంలో కొండ నుంచి పెద్దఎత్తున గ్రావెల్‌ను భారీ వాహనాలతో అక్రమంగా తరలిస్తుండడంతో భారీగా ఈ గుంతలు ఏర్పడ్డాయి. ఈ క్వారీ వాహనాల కారణంగా గుంతలు ఏర్పడినప్పటికీ సంబంధిత క్వారీ యాజమాన్యం కనీసం పట్టించుకోకపోవడంతో పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఈ గుంతలు కారణంగా పొందూరుకు చెందిన యు.వి.రమణమూర్తి ప్రమాదానికి గురై శ్రీకాకుళం ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందు తున్నారు. ఈ విధంగా ప్రతీరోజు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఈ గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలకు గురై తీవ్రంగా గాయ పడుతున్నారు. నిత్యం ఇదే రహదారిపై అధికారులు సైతం రాకపోకలు సాగిస్తున్నా ఈ గుంతలు మాత్రం వారికి కానరావడం లేదా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు సైతం ఈ గుంతలను పట్టించుకోకపోవడం దారుణమంటూ వాహనదారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఇది ఆంధ్రా-ఒడిస్సా అంతరాష్ట్ర రహదారి కావడంతో రాత్రి వేళల్లో ఎక్కువగా ఒడిశాకు చెందిన వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చివేయాలంటూ వాహనదారులు కోరుతున్నారు.


కృష్ణాపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంతలు

వ్యక్తి మృతి

పొందూరు: మండలంలోని నందివాడ సమీపంలోని సత్యసాయి స్టోన్‌క్రషర్ వెనుకభాగంలో ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామానికి చెందిన కాశి మధుసూదనరావు (26) అనే వ్యక్తి మృతి చెందినట్లు గురువారం ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మృతుడు లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడని, ఎప్పటిలాగా బుధవారం ఉదయం ఇంటినుంచి బయటకు వెళ్లాడని తెలిపారు. సత్యసాయి స్టోన్ క్రషర్‌లో పనిచేస్తున్న స్నేహితుడు సూరిబాబుతో కలిసి మద్యం తాగాడు. సాయంత్రం బహిర్భూమికని క్రషర్ వెనుక భాగానికి వెళ్లి ఎప్పటికీ రాకపోవడంతో వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడని, అతిగా మద్యం తాగడంతో మృతి చెంది ఉంటాడని అనుమానాన్ని వ్యక్తం చేశారు. మృతుని తల్లి భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఎఎస్ఐ అప్పన్న మృతి


అప్పన్న (ఫైల్)

మెళియాపుట్టి: పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎఎస్ఐ బగాది అప్పన్న (54) గురువారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతి చెందారు. ఎచ్చెర్ల మండలంలోని లక్ష్ముదుపేటకు చెందిన ఈయన 1989 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. ఈ క్రమంలో ఎఎస్ఐగా ఉద్యోగోన్నతి పొందారు. 2021 ఆగస్టు 11న మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో ఎఎస్ఐగా విధుల్లో చేరారు. ఈయన చాపరలో ఉన్న ఇంట్లో ఉంటూ విధులు నిర్వర్తిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్లారు. కొంత సమయం తరువాత అనారోగ్యంగా ఉందని రైటర్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తీసుకెళ్లమని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ రమణ అప్పన్నను చాపర ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు పరీక్షించగా మార్గంమధ్యలో మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భార్య, కుమార్తె, అల్లుడు ఆస్పత్రికి చేరుకున్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం


లావణ్య మృతదేహం

పలాస: మండలంలోని కంబిరిగాం వరహాల గెడ్డలో మెళియాపుట్టి మండలం దానగోరకు చెందిన లావణ్య (35) బుధవారం గల్లంతైన విషయం విదితమే. గురువారం బ్రాహ్మణతర్ల వంతెన వద్ద మృతదేహం లభ్యమైంది. రెండు రోజులుగా దానగోర గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కంబిరిగాం నుంచి బ్రాహ్మణతర్ల మధ్యఉన్న వరహాల గెడ్డలో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్న సమయంలో బ్రాహ్మణతర్లకు చెందిన స్థానికులు ఇనుప పైపులైన్‌కు అడ్డుకొని మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వచ్చిన మృతుడు బంధువులు వరద నీటిలో దిగి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషించేవాడు. మృతుడికి భార్య అన్నమ్మ, కుమారుడు సంజీత్, కుమార్తె రశ్మిత ఉన్నారు. కాశీబుగ్గ ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎఎన్ఎం దుర్మరణం


మాలతీబాయి మృతదేహం

కొత్తూరు: మండలంలోని కడుమ నచివాలయంలో ఎఎన్ఎం పనిచేస్తున్న రొక్కం మాలతీబాయి (52) గురువారం మృతి చెందింది. ఈమె ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌లో నివాసం ఉంటుంది. ఉదయం విధులు నిమిత్తం తన కన్నవారి ఇంటి నుంచి కడుమ సచివాలయానికి వెళుతుంది. కిడిగాం సమీపంలో స్కూటీ అదుపు తప్పి రోడ్డుపై జారీ పడడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో అక్కడికక్కడే మృత్యుతపడింది. మృతురాలు అత్తవారు మండలంలోని వసప కాలనీ. భర్త శ్రీనివాసరావుతో విభేదాలు కారణంగా కాశీనగర్‌లో ఉన్న కన్నవారి ఇంట్లో ఉందింది. వీరికి ఒక కుమారుడు అమెరికాలో ఉంటున్నాడు. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సి కోటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం


అదృశ్యమైన తేజ

లావేరు: మండలంలోని కొత్త కుంకాం గ్రామానికి చెందిన వివాహిత కూనపల్లి తేజ అనే మహిళ ఈనెల 28 నుంచి కనిపించలేదని ఆమె భర్త ఇజ్జు వెంకట రమణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జి.సిగడాం మండలం శెట్టిపొదిలాం గ్రామానికి చెందిన ఇజ్జు వెంకటరమణతో ఆరు నెలలు క్రితం వివాహ మైంది. కన్నవారి ఊరు కొత్తకుంకాంలో ఉండగా ఈనెల 28 నుంచి కనిపించ లేదు. రెండు రోజులుగా వెతికనా కనిపించకపోవడంతో భర్త వెంకటరమణ ఫిర్యాదుతో లావేరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎఎస్ఐ ముద్దాడ రాజారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి జోగారావు తెలిపారు.

వ్యక్తి అరెస్టు

టెక్కలి రూరల్ : మండలంలో బూర్గంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని నలభై మద్యం సీసాలతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ షేక్ మీరా సాహెబ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలలో 79 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 540 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెల్ట్ షాపులు ఎక్కడైనా నిర్వహించినట్లయితే టోల్ ఫ్రీ నంబరుకు 1440కు సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రొక్లెయినర్ బోల్తా

ఇచ్ఛాపురం : మండలంలోని తీర ప్రాంత బూర్జపాడు వద్ద పనులు చేస్తున్న ప్రొక్లెయినర్ గురువారం కల్వర్టు కింద బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో కల్వర్టు కింద కూరుకుపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే జనసేన నాయకులు చీకటి కృష్ణయ్య అధికారులకు సమాచారం అందజేశారు.

తుపాను బాధితులకు అండగా ఉంటాం


పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

మొంథా తుపాను బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని తోలాపిలో తుపాను ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న సుబ్బినాయుడు కోనేరుకు వరదనీరు ముంచెత్తడంతో పాఠశాల చుట్టూ నిండుగా చేరిపోయిన నీటిని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న నీటిని బయటకు తరలించడంతో పాటు శాశ్వతంగా నీరు చేరకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో తుపాను కారణంగా వాటిల్లిన నష్టాలను అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో తుపాను ప్రభావం వలన జరిగిన నష్టాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపిడిఒ ఎస్. వాసుదేవరావు, తహశీల్దార్ వెంకటేష్, ఆర్అండ్‌బి ఎఇ రాజు, హెచ్ఎం ఉమామహేశ్వరి, కూటమి నాయకులు పొన్నాడ రామారావు, గంగాధరరావు, బాలకృష్ణ, శ్రీనివాసరావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలి

బూర్జ: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ద్వారా కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సిఎఫ్‌లు కృషి చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సూచించారు. గురువారం బూర్జ మండలంలోని సిఎఫ్‌లు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. స్వశక్తితో ఎదిగేందుకు మహిళలకు పలు పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహకాలను కల్పిస్తుందన్నారు. సిఎఫ్‌లు మహిళల్లో ఉన్న ప్రతిభను చూసి వారికి ఉన్న అభివృద్ధి మేరకు గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రోత్సాహం అందించాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చేపల పెంపకం, నాటుకోళ్లు పెంపకం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. ఐకెపి ఎపిఎం బాబురావు, సిఎఫ్‌లు ఉన్నారు. అంతకు ముందు కూటమి ప్రభుత్వం సిఎఫ్‌లను ప్రతి మూడు నెలలకు ఒకసారి రెన్యువల్ చేయాల్సిన అవసరం లేదని ప్రకటించడంతో ఎమ్మెల్యేకు వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను విరమించుకోవాలి


సంతకాల సేకరణ చేపడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

పేదవాడికి వైద్య విద్యను దూరం చేసే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వైసిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని తుంగపేట, లైదాం, కొంచాడ, రాపాక గ్రామాల్లో గురువారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేదవాళ్లకు ప్రభుత్వ వైద్యవిద్యను అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైద్యకళాశాలలను ఏర్పాటు చేస్తే కూటమి ప్రభుత్వం వాటిని ప్రవేటీకరణ చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. కాబట్టి ఈ కార్యక్రమం ద్వారా ప్రజాభిప్రాయాన్ని సేకరించేలా కోటి సంతకాల సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు కొంచాడ రమణ మూర్తి, వైసిపి నాయకులు చింతాడ సత్యప్రసాద్, కిల్లాన సూర్యారావు, గుడ్ల మోహనరావు, పైడి నాగభూషన్, గాడు నాగరాజు, పోలయ్య, శంకరరావు, సూరపనాయుడు, మురళీ, రమణ పాల్గొన్నారు.

రెల్లిగెడ్డ వంతెన పరిశీలన..

మొంథా తుఫాన్ కారణంగా రెల్లిగెడ్డకు వరదనీరు పోటెత్తడంతో లైదాం వద్ద కోతకు గురైన వంతెనను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ పరిశీలించారు. వరదనీరు కారణంగా వంతెన వద్ద రహదారి కోతకు గురై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారిందన్నారు. ఈ రహదారిపై సంతకవిటి, పొందూరు మండలాలకు చెందిన వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, వెంటనే గొయ్యిని అధికారులు పూడ్చివేయాలని లేకుంటే ప్రమాదాలు చోటుచేసు కుంటాయన్నారు. ఈయన వెంట పలువురు వైసిపి నాయకులు ఉన్నారు.

టెక్కలి రూరల్: కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ అన్నారు. మండలంలోని తిర్లంగిలో సర్పంచ్ ప్రతినిధి కృష్ణంరాజు అధ్యక్షతన కోటి సంతకాల సేకరణలో భాగంగా గురువారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే విద్య, వైద్యంతో పాటు మహిళా, రైతు సంక్షేమం అందిందని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయకుండా తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారని ఆరోపించారు. అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ మంత్రిగా ఉంటూ రైతు నాశనాన్ని కోరుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, వైసిపి మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వరరావు బడ్డా రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి


గురుకుల విద్యాలయాన్ని పరిశీలిస్తున్న యశోద లక్ష్మి

ప్రజాశక్తి- బూర్జ

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ వై.యశోద లక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని కొల్లివలసలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల తరగతి గదులు, గ్రంథాలయం, విద్యార్థుల వసతి సముదాయాన్ని, టాయిలెట్లను, విద్యార్థుల భోజనశాలను, వంటశాలను స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వాతావరణంలో మార్పులు వచ్చినందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గురుకులం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సిబ్బందికి సూచించారు. ఆమెతో పాటు కళాశాల ప్రధానోపాధ్యాయులు నూక రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, అధ్యాపకులు కె.రామ్మూర్తి, జి.విశ్వేశ్వరరావు, జి.చిన్నంనాయుడు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మిక కుటుంబానికి చేయూత


బియ్యం బస్తాను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మొంథా తుపాను నేపథ్యంలో వీస్తున్న ఈదురుగాలులు, వర్షాలకు మండలంలోని కోష్ట పంచాయతీ పరిధిలో ఎలాంటి నష్టం జరగకుండా అందరికీ ముందు నుంచి అప్రమత్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దువ్వానపేట వీధుల్లో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపిటిసి పిషిని జగన్నాథం నాయుడు పర్యటించారు. పంచాయతీలో నిత్యం పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికుని ఇల్లు కూలిపోవడంతో ఆ కుటుంబానికి బియ్యం బస్తాను అందజేశారు. అలాగే మున్ముందు కూడా అవసరమైన సహాయం అందిస్తామని చెప్పి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కోష్ట పంచాయతీ సెక్రటరీ చంద్రశేఖర్, యువ నాయకులు పిసిని హరికృష్ణ, పిసిని చిన్నారావు, పిసిని అప్పలనాయుడు, పిసిని చిన్నా, కోటి, అప్పారావు, సంతు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ పిఒ వేధింపులు

స్పృహ కోల్పోయిన అంగన్వాడీ కార్యకర్త


పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

కోటబొమ్మాళి మండలం కొత్తపేట అంగన్వాడీ కార్యకర్త నీలవేణిని రాజకీయ వేధింపులు చేస్తూ రాజకీయ ఒత్తిళ్లకు లొంగి అధికారులు గత మూడు మాసాల క్రితం అక్రమంగా విధుల నుంచి తొలగించారు. ఈ చర్యలపై ఆమె హైకోర్టును ఆశ్రయించగా, కోర్టు విధుల్లోకి తీసుకోమని ఉత్తర్వులు ఇచ్చింది. ఆర్డర్ ప్రకారం విధుల్లోకి తీసుకొని ఆమెకు మళ్లీ కోర్టులో వేసిన పిటీషన్‌ను ఉపసంహరించుకోమని గత వారం రోజుల క్రితం నుంచి ఒత్తిడి చేస్తున్నారు. ఆమె నిరాకరించడంతో నీవు ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని మళ్లీ విజిట్లు ప్రారంభించి నీకు నోటీసులు ఇచ్చి ఉద్యోగం నుంచి తొలగిస్తానని భయభ్రాంతులకు గురి చేశారు. నీవు వెంటనే శ్రీకాకుళం పీడీ కార్యాలయానికి రావాలని బెదిరించారు. ఆమె పీడీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లగా మార్గంమధ్యలో శ్రీకాకుళం కాంప్లెక్స్ దగ్గర స్పృహ తప్పి పడిపోయింది. ఆమె బంధువైన ఆడబొట్టి తిరిగి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో నీలవేణిని పరామర్శించిన సిఐటియు జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు ఈ రకమైన చర్యలు సరికాదని ఖండించారు. పరామర్శించిన వారిలో సిఐటియు మండల కార్యదర్శి గుండు నీలన్న, బాలి శ్రీనివాసు, సిహెచ్. వెంకటరావు, ఆనంద్ ఉన్నారు. అలాగే విషయం తెలుసుకొని అంగన్వాడీ కార్యకర్తలు పరామర్శించి ఆందోళన వ్యక్తం చేశారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి


వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మొంథా తుపాను వల్ల నష్టపోయిన పంటలకు నష్టపరిహారం తక్షణమే అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కోనారి మోహనరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.బాలాజీరావు, టి.భాస్కరరావు ప్రభుత్వానికి డిమాండ్ చేశారు మండలంలోని సీతాపురం, బెండి, గల్లి, శివరాంపురం, నగరంపల్లి గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల అనేక గ్రామాల్లో వరి పంట నీట మునిగిందన్నారు. పంట పొలాల్లో ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయన్నారు. పంటలు పాడవ్వడంతో పాటు ధాన్యం రంగు మారి దిగుబడులు తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు పంటల బీమా వర్తింప చేయాలన్నారు. రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం ఆరబెట్టుకునేందుకు టార్పాలిన్లు పూర్తి సబ్సిడీతో రైతులందరికీ అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు సింగారి విఘ్నేశ్వరరావు, తమ్మినాన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మలో నీటి మునిగిన పంట పొలాలను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు కారనంగా వరి, పత్తి, అరటి, మొక్కజొన్న, మినుము, కూరగాయ పంటలు ఆరుగాలం శ్రమించి అప్పుతెచ్చి పెట్టుబడి పెట్టి పండించిన పంటలు చేతికొచ్చే సమయానికి మొంథా తుపాను ప్రభావంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షనమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పనస రమేష్, వైకుంఠరావు, ధర్మారావు, వెంకటరావు, చిన్నారావు పాల్గొన్నారు.


కొత్తూరు : దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

భూసార పరీక్షపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న కృష్ణారావు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలోని ఏకలవ్య స్కూల్‌లో ఆమదాలవలస భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ సంచాలకులు కృష్ణారావు విద్యార్థులకు స్కూల్ సాయిల్ శాంపిల్స్ హెల్త్ ప్రోగ్రాంపైన గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, అలాగే రైతులకు అవగాహన, భూసార పరీక్ష తుది జాబితా, భూసార పరీక్షా కేంద్రంలో పరీక్ష చేయు విధానం వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో అవగాహన, నైపుణ్యత కల్పించి వారి ద్వారా వాళ్ల తల్లిదండ్రులకు, రైతులకు అవగాహన కల్పించే విధంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు రవికుమార్, పద్మనాభం, సుజాత, లతశ్రీ, ఏకలవ్య స్కూల్ అధ్యాపక సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారి ప్రభావతి, కృషి విజ్ఞాన కేంద్రం టెక్నీషియన్ కిషోర్ పాల్గొన్నారు.

తెలుగు భాషపై అభిమానంతో సాహితీ సేవ



ప్రజాశక్తి- అరసవల్లి

రచయత ఐఎన్‌డి ప్రసాదరావు నియమ, నిబద్ధత కలిగిన రచయిత. అయన తెలుగు భాషాభిమాని. కవికి కుక్క పిల్ల, సబ్బు బిళ్ల ఏదైనా కవితాంశమే. అదేవిధంగా ప్రసాదరావు కూడా ప్రతీరోజు మాధ్యమాల్లో, పుస్తకాల్లో దొరికిన వస్తువు, పరిస్థితి, ప్రభావంపై సునాయాసంగా కవితలు రాసి అందరి మన్నన్నలు పొందుతున్నారు. అయన తెలుగు భాషపై ఉన్న అభిమానంతో సాహితీ సేవ 1991 నుంచి చేస్తూ నా కవితలు సుమారు వందవరకు తెలుగులోకంలో ప్రచురితమయ్యాయి. అదేవిధంగా అప్పటి మంత్రి, కళాకారుడు చిగిరిపల్లి శ్యామల రావుతో కూడా నటించిన సందర్భం ఉంది. అదే విధంగా 2000 సంవత్సరం నుంచి భావశ్రీ, రామిశెట్టి వారి శ్రీకాకుళం సాహితిలో, 2015 నుంచి నేటివరకు తెలుగు రచయితల వేదికలో కొనసాగుతూ పలు సాహితీ, సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఇటీవల నూతనంగా శ్రీశ్రీ కళావేదికలో కూడా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉంటూ సాహితీసేవ చేస్తున్నారు. జన జాగృతి పలాస వారిచే శ్రీశ్రీ కళావేదికచే, మాతృసంస్థ తెరవే ఆధ్వర్యంలో పలు పురస్కారాలు అందుకున్నారు. ఇటీవల నరసారావుపేటలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తెలుగుతేజం అవార్డు అందుకున్నారు. ఉగాది, తెలుగు భాష, శతకవిసమ్మేళన పురస్కారాలు అందుకున్నారు. అదేవిధంగా శ్రీనివాసనాట్య మండలి అధ్యక్షులు కిమ్మి సంతోష్ ప్రోత్సాహంతో నాటకరంగంలో నారధునిగా, పండితులుగా ఎన్నో పాత్రలు పోషించారు. అయన శ్రీకాకుళం డిఇఒ ఆఫీసులో సూపరింటిండెంట్‌గా ఉద్యోగ విరమణ పొందారు. ఆయన నిబద్ధతకు మెచ్చి అధికారులు మరలా డిఇఒ కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం సమన్వయకర్తగా నియమించారు.



పురస్కారాన్ని అందుకుంటున్న ప్రసాదరావు (ఫైల్)

విద్యార్థులు విజయపథంలో దూసుకుపోవాలి

ప్రజాశక్తి- సోంపేట

విద్యార్థి దశ జీవితంలో ఎంతో కీలకమని, విద్యార్థులు విజయ పథంలో దూసుకుపోవాలని మనోవికాస నిపుణులు రాంబుడ్డి గణపతి అన్నారు. మండలంలోని గొనకపాడు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.కృష్ణారావు అధ్యక్షతన 'జీవిత పాఠం - జీవన నైపుణ్యాలు' అనే అంశంపై శనివారం మాట్లాడారు. జీవితంలో జయాపజయాలు, చీకటి, వెలుతురు, సుఖదుఃఖాలు, భయం, బాధలు ఉంటానే ఉంటాయని అన్నారు. 'నేను జీవితంలో ఏమీ సాధించలేనని గిరిగీసిన వృత్తిలో కొట్టుమిట్టాడుతూ కాలాన్ని వృథా చేయరాదని' అన్నారు. ధైర్యంతో ముందుకు పోతే సానుకూల విజయాలు సాధించవచ్చని తెలిపారు. జీవితానికి చదువు ఒక ముడిపదార్థం లాంటిదని అన్నారు. నిరాశ, నిస్పృహలతో ఉన్న వారికి ఒక ఆధారం లాంటిదని అన్నారు. జీవితంలో కుంగిపోకుండా నింగిని తాకే ధైర్య సాహసాలు ఇప్పటి నుంచే అలవాటుగా చేసుకోవాలన్నారు. మహానుభావులు అద్భుతాలు సాధించారంటే రగిలీతత్వం, కఠోర శ్రమతో ఆ స్థాయికి చేరి సమాజానికి ఉదాహరణలుగా నిలిచారని గుర్తుచేశారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో పాటు సమయపాలన అవసరమన్నారు.


మాట్లాడుతున్న గణపతి


హెచ్‌సి కుటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వరరెడ్డి

బీమా స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పోలీస్ శాలరీ ప్యాకేజీ బీమా స్కీం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్‌పి కెవి మహేశ్వరరెడ్డి పోలీసులకు సూచించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పి.జగదీశ్వరరావు జూన్ నెలలో టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతి చెందారు. ఆయన కుటుంబానికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పోలీస్ శాలరీ ప్యాకేజీ కింద కల్పించిన వ్యక్తిగత ప్రమాద బీమా మేరకు రూ.కోటి మంజూరు చేశారు. ఈ నగదు చెక్కును ఎస్‌పి కానిస్టేబుల్ కుటుంబసభ్యులకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసు శాలరీ ప్యాకేజ్ ద్వారా లభించే లబ్ధిని జిల్లా పోలీసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకం పోలీసు అధికారులు, సిబ్బంది కుటుంబాలకు ప్రమాద, అత్యవసర సమయాల్లో భరోసా కలిగించే విధంగా ఉంటున్నారు. ప్రతిఒక్కరూ తమ ఖాతాలను ఈ పోలీస్ శాలరీ ప్యాకేజీకి అనుసంధానం చేసుకోవాలన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు పోలీసు సిబ్బందికి ఆర్థిక భద్రత కల్పించడంలో భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, కార్యాలయం ఎ.ఒ. గోపినాథ్, బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ గోవింద్ కుమార్ సింగ్, బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుప్తా

నడకతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నడకతోనే ఆరోగ్యం లభిస్తుందని, ప్రతిఒక్కరూ ఆయా ప్రాంతాల్లో ఉన్న వాకర్స్ క్లబ్‌ల్లో చేరాలని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, వాకర్స్ సంస్థ స్థాపకులు మాతిపాత్రుని సుందర్ దాస్ 95వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్టార్‌వాకర్స్ క్లబ్ కో-ఆర్డినేటర్ ఎస్.జోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీజీ గుప్తా మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం విశాఖలో ప్రారంభమైన వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ నేడు దేశవ్యాప్తంగా 1690 క్లబ్‌లుగా విస్తరించి లక్ష మంది సభ్యులున్నారన్నారు. కేవలం వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపకులు గేదెల ఇందిరాప్రసాద్, మహిళా క్లబ్ అధ్యక్షులు గేదెల లక్ష్మీ, డిప్యూటీ గవర్నర్ నాగభూషణం, ఎం.మల్లిబాబు, క్రీడాకారులు పాల్గొన్నారు.


బంగారు పతకాలు సాధించిన కిరణ్ కుమార్

మార్షల్ ఆర్ట్స్‌లో మూడు బంగారు పతకాలు

సోంపేట : మండలంలోని ఇసకలపాలెంకు చెందిన పొట్టి కిరణ్‌కుమార్ ఇటీవల భోపాల్‌లో నిర్వహించిన మార్షల్ ఆర్ట్స్ నేషనల్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాడు. కిరణ్ కుమార్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, దేవకితో కలిసి అండమాన్ నికోబార్ దీవుల్లో నివాసం ఉంటున్నాడు. మత్స్యకారుల కుటుంబానికి చెందిన కిరణ్‌కుమార్ చిన్నప్పటి నుంచి మార్షల్ ఆర్ట్స్‌పై మక్కువ పెంచుకున్నారు. కోచ్‌లు సెల్వం, సీమదేవిల పర్యవేక్షణలో ప్రావీణ్యం సంపాదించాడు. ఈ పోటీల్లో బంగారు పతకాలు గెలిచి ఎందరికో ఆదర్శనీడయ్యాడని అండమాన్ నేతాజీ యూత్ ప్రధాన కార్యదర్శి హేమరాజు, స్థానిక సర్పంచ్ ఈశ్వరరావు, బాబూరావు, రామారావు అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు కవిటి విద్యార్థులు

కవిటి: విద్యార్థుల ప్రతిభకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కళా ఉత్సవ పోటీల్లో భాగంగా ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడ మురళి రిసార్ట్స్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మండల అఖిల్, కోళ్ల వికాస్‌లు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అనంతరం రాష్ట్రస్థాయిలో 'ఇండీజీనియస్ టాయ్స్' విభాగంలో కూడా ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందారు. విద్యార్థుల విజయంపై ప్రధానోపాధ్యాయుడు నెయ్యిల విశ్వనాథం ఆనందం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో కూడా ప్రతిభ కనబరచి పాఠశాలకే కాకుండా మన జిల్లాకు, రాష్ట్రానికి గౌరవం తీసుకురావాలని అభిలషించారు. అదే సమయంలో విద్యార్థులకు తర్ఫీదు అందించిన ఉపాధ్యాయులు యు గిరిబాబు, పిబికె శర్మలను అభినందించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ తెప్పల మోహనరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా అర్చన పుట్టినరోజు

నరసన్నపేట : టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన పుట్టిన రోజు వేడుకలు కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే రమణమూర్తి ఆధ్వర్యాన కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, ఉపసర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, టిడిపి మండల అధ్యక్షుల అడపా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు వూన్న అనీల్, ఎంపిటిసి మాజీ సభ్యులు నేతింటి భారతి, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్స్ పంపిణీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు విశాఖపట్నం జుత్తు జగ్గన్న మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో స్టడీ మెటీరియల్‌ను తయారు చేశారు. మండలానికి 1279 స్టడీ మెటీరియల్ పుస్తకాలు మండల విద్యాశాఖ కార్యాలయానికి గురువారం అందించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ స్టడీ మెటీరియల్ అందిస్తామని ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్. విశ్వనాథం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి విద్యా తోడ్పాటు అందిస్తున్న ట్రస్టుకు అభినందనలు తెలిపారు. ఎంఆర్‌సి సిబ్బంది కామేష్, రవి, సిఆర్ఎంటిలు దేవరాజు, గణేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల


ఎంఆర్‌సికి చేరిన స్టడీ మెటీరియల్స్

డోకులపాడు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎస్.ఊర్మిళ పదో తరగతి తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ గురువారం పంపిణీ చేశారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలనే ఉద్దేశంతో 20 మంది విద్యార్థులకు రూ.4 వేలు విలువ చేసే పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్.సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోంపేట : విశాఖపట్నానికి చెందిన జుట్టు జగ్గన్న మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు పదో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్స్ అందజేశామని ట్రస్టు అధ్యక్షులు జె.సింహాచలం తెలిపారు. సోంపేట పాఠశాల హెచ్ఎం మల్లేశ్వరరావు, ఒరియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

కవిటి: విశాఖపట్నానికి చెందిన జుత్తు జగన్నాయకులు ఛారిట్రబుల్ ట్రస్టు పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ జుత్తు సింహాచలం మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లో రూ.8 లక్షల విలువచేసే 3500 సెట్ల స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఇఒ-2 ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ ట్రస్టు సేవలు కొనియాడారు. అదే సమయంలో మండలంలోని 223 ఇంగ్లీష్, 60 ఒడియా స్టడీ మెటీరియల్ సెట్లు అందించినట్టు తెలిపారు.

ఉప్పొంగుతున్న నాగావళి నది

ప్రజాశక్తి- బూర్జ

నాగవళి నది పరవళ్లు తొక్కుతుంది. తుపాను కారణంగా గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నాగావళి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. నారాయణపురం ఆనకట్ట వద్ద గురువారం సాయంత్రానికి 35 వేల క్యూసెక్కులు నీరు ప్రవహిస్తుందని అధికారులు చెబుతున్నారు. రాత్రికి ఇంకా పెరిగినట్లయితే నదీ పరివాహక గ్రామాల్లో నీరు చేరుకునే అవకాశం ఉంది. నది పరివాహక గ్రామాలైన లాభాం, వావాం, బూర్జ, చిన్న లంకాం, పెద్దలంకాం తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ తిరుపతిరావు, తహశీల్దార్ వై.వి.పద్మావతి సూచించారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని, అధికారులను అప్రమత్తం చేశామని, ఎప్పటికప్పుడు పరిస్థితిలను సమీక్షించి తెలియజేయాలని ఆదేశించినట్లు చెప్పారు. ఆయా గ్రామాల ప్రజలు నదిలోకి దిగరాలని సూచించారు.

దాబాల్లో మద్య నిషేధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం జాతీయ రహదారి వద్ద దాబాల వద్ద మద్యం అమ్మకాలు చేసినా, సేవించినా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి మండలంలోని దాభాల వద్ద మద్య నిషేధం అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 1 నుంచి విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎపి ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా దుకాణాల్లో విక్రయించిన మద్యం కల్తీయా? కాదా? తెలుసుకోవచ్చునని అన్నారు. అందుకు గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మద్యం బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నాణ్యమైన ఉత్పత్తి అని తనిఖీ చేయాలన్నారు. దీనికి సంబంధించిన ఎటువంటి సమాచారానైనా టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.


భైరిపురంలో నేల కొరిగిన మట్టిగోడ

కూలిన మట్టి గోడ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని భైరిపురానికి చెందిన బొర్ర సుందరరావు మట్టిగోడ గురువారం ఉదయం నేల కూలింది. ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన గోడ కూలిపోయిందని, పేద కుటుంబానికి చెందిన తనకు ప్రభుత్వం అండగా నిలవాలని సుందరరావు కోరుతున్నాడు. పని చేసుకుంటూ బతుకుతున్న తనకు ప్రస్తుతం గోడ కట్టుకునే స్తోమత లేదని తెలిపారు. అదే విధంగా ఇటీవల కురిసిన వర్షాలకు మంగళవారం రాత్రి తన ఇంటి గోడ కూలిపోయిందని, అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కవిటి బెహరా వీధికి చెందిన బెహరా తిరుపతి ఆవేదన వ్యక్తం చేశాడు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి- మందస

మండలం భైరసారింగాపురం సచివాలయాన్ని ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో అలసత్వం వహించరాదన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజలకు పారదర్శకంగా, సులువుగా ప్రజలకు అందించాలన్నారు. ప్రభుత్వ భాగస్వామ్యంలో మీ వంతు చాలా కీలకమని కితాబు ఇచ్చారు. అనంతరం తుపాను వల్ల నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ భావన దుర్యోధన, మామిడి మాధవరావు, ముడిమించిన భాస్కరరావు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

హెల్పింగ్ హేండ్స్ చేయూత

కంచిలి: మండలంలోని ప్రధానపుట్టుగకు చెందిన ఊర్మిళ బిసాయి గత కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతుంది. నిరుపేద కావడంతో చికిత్స కోసం ఆర్థిక స్తోమత సరిపోక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని గ్రామ యువత ద్వారా తెలుసుకున్న మా మాణిక్యేశ్వరి హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు చేయూత అందించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యాన గురువారం రూ.15 వేలు ఆర్థికసాయం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెప్పుడో?

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని కళాశాల రహదారిలో ప్రయాణం చేయాలంటే భయం భయంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనునిత్యం ఈ ఇరుకైన రోడ్డులో భారీ వాహనాలు రాకపోకలు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య నిత్యం వెంటాడుతోంది. ట్రాఫిక్ అధికారులు నిర్లక్ష్యం వల్ల సమస్య రోజురోజుకీ పెరుగుతుంది. దీనిపై పూర్తిగా స్పందించడం లేదనే భావన పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతుంది. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు పెరగడం, భారీ వాహనాల ప్రవేశంతో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ పెరుగుతుంది. ఆక్రమణలు నిరోధించాల్సిన పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు సహకరిస్తూ ముందుకు సాగుతున్నారు. ట్రాఫిక్ నిరోధించాల్సిన పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించడం లేదని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. కళాశాల రోడ్డు ఆక్రమణలు తొలగింపు, బజార్ పునర్ నిర్మాణ పనులు చేపట్టాలని వ్యాపారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలాగే ఈ


నిలిచిన వాహనాలు

రోడ్డుకు ఒక పక్కన ఉన్న రాజుల చెరువు అభివృద్ధి ఒట్టి ఉట్టి మాటలు గానే మిగిలిపోయింది. అధికారంలో ఎవరున్నా రాజుల చెరువు అభివృద్ధి మాటలకే పరిమితం అవుతుంది. ఓటు బ్యాంకు రాజకీయాలతో ఎటువంటి చర్యలు చేపట్టేందుకు ముందుకు రావడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాజుల చెరువు అభివృద్ధి కంటే ఆక్రమణలకే అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు సహకరిస్తున్నారని పట్టణ ప్రజలు బహిరంగ వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల నిర్లక్ష్య వైఖరి వీడాలని కోరుతున్నారు.

ఆదాయ వనరులు సమకూర్చుకోవాలి


ఎస్‌సి బాలుర వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

కోటబొమ్మాళి: మండల పరిషత్‌కు ఆదాయ వనరులు సమకూరే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి ఆదేశించారు. మండల పరిషత్‌కు సంబంధించి ఎదురుగా ఉన్న పాత సిబ్బంది గృహాలను గురువారం పరిశీలించారు. దీనికి సంబంధించిన మ్యాప్‌ను తక్షణం అందజేయాలని తహశీల్దార్ ఆర్.అప్పలరాజుకు ఆదేశించారు. అలాగే ప్రస్తుతం ఈ స్థలంలో ఉన్న కార్యాలయాలు ఏమిటని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌కు అడుగగా, ఎంజిఎన్ఆర్ఇజిఎస్, వెలుగు, గృహ నిర్మాణశాఖ కార్యాలయాలు పని చేస్తున్నాయని తెలిపారు. పాత బడిన గృహాల్లో ఎవరూ నివసించడం లేదని తెలిపారు. ఈ ఖాళీ స్థలంలో కన్వేర్షన్ హాల్, వాణిజ్య సముదాయాలు అవసరమైన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తే ఆదాయ వనరులు సమకూర్చుకోవచ్చునని అన్నారు. ఈ వివరాలను వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఎస్‌సి బాలుర వసతిగృహాన్ని పరిశీలించి వసతులు గురించి వార్డెన్ సీతారాంను అడిగి తెలుసుకున్నారు. బాలులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రభుత్వ నిబంధనలు మేరకు పౌష్టికాహారం అందించాలని అన్నారు. ఖాళీ ప్రదేశంలో కూరగాయ పెంపకం చేసుకోవాలన్నారు. విద్యార్థులు వాలీబాలు తదితర క్రీడలను అడుకొనేందుకు స్థలం కేటాయించామని తెలిపారు.


కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో ఉన్న కూరగాయల వ్యాపారుల కోసం ఎంపిడిఒ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీమహాలక్ష్మి తల్లి కూరగాయల మార్కెట్‌ను గురువారం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై రోడ్డు పక్కన వ్యాపారం చేసి ట్రాఫిక్ ఇబ్బంది చేయకుండా సక్రమంగా మార్కెట్‌ని వినియోగించు కోవాలని వర్తకులకు సూచించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మాజీ అధ్యక్షులు చౌదరి బాజ్జి, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, కూటమి నాయకులు లంక శ్యామలరావు, పిన్నింటి బానోజీనాయుడు, పిసిని జగన్నాథం నాయుడు,


కూరగాయల మార్కెట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ముప్పిడి సురేష్, ఎఫ్ఎస్‌సిఎస్ అధ్యక్షులు బొంతు విజయ కృష్ణ, ఇనపకుర్తి తోటయ్య దొర, మండపాక కనకారావు, కె.లక్ష్మణరావు, డిజిఎం శ్రీనివాసరావు, దన్నాన మహేష్, స్వామి నాయుడు, వంశీ, ఎం.పోలీసు, దాసరి బలరాం తదితరులు పాల్గొన్నారు.


జగన్‌తో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కృష్ణదాస్

బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

జిల్లాలో మొంథా తుపాను పంటల నష్టాల అంచనా, సహాయక చర్యల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. మాజీ సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై చర్చించారు. అనంతరం వైసిపి కార్యాలయంలో కృష్ణదాస్ విలేకరులతో మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలన్నారు. ప్రతి పంటకూ ఇన్సూరెన్స్ వర్తింజేయాలన్నారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ప్రజా వైద్య రంగాన్ని బలహీనపరిచే ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహ రించు కోవాలని డిమాండ్ చేశారు. నవంబరు 11న వైసిపి ఆధ్వర్యాన నిర్వహించనున్న కోటి సంతకాల సేకరణ, అనంతరం ఉద్యమాన్ని విజయవంతం చేయా లని కార్యకర్తలను కోరారు. ప్రజా వైద్య హక్కుల పరి రక్షణకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పారదర్శకంగా పనిచేయాలి

ప్రజాశక్తి- కవిటి

తుపాను ప్రభావంతో ఆసరా కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అందించే ఉచిత నిత్యావసర సరుకుల పంపిణీలో పారదర్శకత పాటించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. ఈ మేరకు కవిటి, ఇచ్ఛాపురం తహశీల్దార్లు, డిటిలు, ఆర్ఐలతో రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో తీరప్రాంత మత్స్యకారులకు సరుకుల పంపిణీలో పక్కాగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరీ సమాచారం సేకరించి ప్రభుత్వానికి నివేదించాలని ఆదేశించారు. అదే సమయంలో వర్షాలతో


సమీక్షిస్తున్న విప్ అశోక్

జరిగిన పంట నష్టం వివరాల సేకరణలో కానీ, దెబ్బతిన్న మట్టి ఇళ్ల సమాచారం పక్కగా నమోదు చేయాలని సూచించారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులను పూర్తి న్యాయం చేయాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్లు మురళీమోహన్, వెంకటరావు, డిటి సంతోష్ పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

మున్సిపల్ కార్మికుల సమ్మె వాయిదా

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్రంలో నవంబరు 3 నుంచి నిర్వహించనున్న మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్, పర్మినెంట్ కార్మికుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తెలిపింది. ఈ మేరకు శ్రీకాకుళం నగర కమిషనర్ ప్రసాదరావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు టి.తిరుపతిరావు, కళ్యాణి. అప్పలరాజు మాట్లాడుతూ పారిశుధ్యం, ప్రజారోగ్యం దృష్ట్యా తామంతా కలిసి సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. విధులకు హాజరై సేవలు అందజేస్తామన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి రూ.1091.94 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమదాలవలస మండలంలో 36 పనులకు గాను రూ.625.74 లక్షలు, పొందూరు మండలంలో 35 పనులకుగాను రూ.466.20 లక్షలు నిధులను ఉపాధి హామీ పథకం కింద కలెక్టర్ ఆమోదం తెలిపినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినందుకు సిఎం చంద్రబాబు నాయుడు, పంచాయతీరాజ్ శాఖామంత్రి పవన్‌కళ్యాణ్‌కు ఎమ్మెల్యే రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కొల్లివలసలో యూత్ ఫెస్టివల్ పోటీలు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని కొల్లివలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో గురువారం నియోజకవర్గ యూత్ ఫెస్టివల్ పోటీలు నిర్వహించారు. స్వామి వివేకనంద జయంతి వేడుకలు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సెట్ శ్రీ యువజన సేవా విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ప్రతిభా నైపుణ్యాన్ని ప్రదర్శించుటకు పై పోటీలు నిర్ణయించారు. జానపద నృత్యం, జానపద పాటలు, కథారచన, కవితారచన, పెయింటింగ్ అంశాల్లో యువత పాల్గొని తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించారు. ఉపన్యాస పోటీల్లో కొలివలస ఇంటర్మీడియట్ విద్యార్థి అభిషేకం, కథ రచనల్లో సిహెచ్ శరత్, జానపద పాటలు కొల్లివలస కళాశాల బృందం, పెయింటింగ్‌లో ఒవిపేట మోడల్ కాలేజీ నుంచి బి.హరిత, జానపద నృత్యం పాటలకు బూర్జ ప్రభుత్వ కళాశాల, కేజీబీవి నుంచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అంబేద్కర్ గురుకులం ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ, ఒవిపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా కార్యాలయంలో అంగీకార్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ మేరకు 500 మందికి బిపి, సుగర్ తదితర వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు వైద్య సిబ్బంది నిర్వహించారు. కార్యక్రమంలో సిఎల్‌టిసి మల్లేశ్వరరావు, జగన్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల పరిశీలన

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ, సహలాలపుట్టుగ గ్రామ సచివాలయాలను డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్ పరిశీలించారు. సిబ్బందితో సమీక్షించి తుపాను నష్టపరిహారాల వివరాలు సేకరించారు. విధుల్లో పారదర్శక పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. పక్కాగా సమాచారం సేకరించాలని ఆదేశించారు.

టెన్నికాయిట్ జిల్లా జట్లు ఎంపిక

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం జిల్లా టెన్నికాయిట్ 18 ఏళ్లలోపు బాల బాలికల ఎంపికలు నిర్వహించారు. బాలురు జట్టులో బి.సిద్ధార్థ, బి.ఉదయ్‌కిరణ్, కె.ప్రవీణ్‌కుమార్, టి.వెంకటేష్, స్టాండ్ బైగా కె.జస్వంత్. బాలికల జట్టులో పి.శ్రావణి పాత్రో, ఎన్.దివ్య, వై.వరలక్ష్మి, బి.నందిని ఎంపికయ్యారని టెన్నికాయిట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.తవిటయ్య తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా బి.తిరుమల, ఎం.దామోదర్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్‌కుమార్, పాఠశాల సిబ్బంది కార్యదర్శి పి.కృష్ణారావు, ఉపాధ్యాయులు చక్రపాణిప్రధానో, ఎ.ఆనందరావు, వెంకటరమణ వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత రైతులకు అండ

మెళియాపుట్టి: మొంథా తుపాను బాధిత రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని జనసేన నాయకులు దుక్క బాలరాజు హామీనిచ్చారు. మండలంలోని తుపాను వల్ల నీట మునిగిన పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాల కారణంగా వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు వివరించారు. దీనిపై నాయకులు జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని అన్నారు. పర్యటనలో జనార్ధనరావు, వాసుదేవరావు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పలాస

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యాన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 'విజిలెన్స్- మనందరి సంయుక్త బాధ్యత' అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో నలుగురు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నరసింహమూర్తి, పవర్ గ్రిడ్ చీఫ్ మేనేజర్ వివిఎన్ఆర్‌కెఎన్ శెట్టి, జూనియర్ ఇంజినీర్లు కె.రఘుపతిరావు, ఇ.అప్పలనాయుడు, అధ్యాపకులు కొండల మధుబాబు, బి.ప్రసాదరావు, ఎస్.యుగంధర్, టి.రమేష్ పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి సర్వే తప్పులు

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని కత్తివరం రెవెన్యూ గ్రామ పరిధిలో ఇటీవల నిర్వహించిన సర్వేలో నమోదైన తప్పులను సవరించాలని టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడలో సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్ రోనంకి కూర్మనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని పలు రెవెన్యూ గ్రామాల్లో జరిగిన తప్పులపై వివరాలు అందజేశారు. తప్పులు సరిచేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో బొడ్డ హరిబాబు, మాదిన సతీష్ పాల్గొన్నారు.

ఆపదలో అండగా...

కవిటి: గ్రామంలో ఓ కుటుంబం ఆపదలో ఉంటే మనకెందుకులే అనుకోకుండా అందరూ తలో ఓ చేయి వేసి ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. మండలంలోని పొందూరుపుట్టుగకు చెందిన తాపీమేస్త్రి రామ్మూర్తి అతని కుమారుడు ప్రణయ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం విదితమే. వారి వైద్య ఖర్చులు నిమిత్తం గ్రామానికి చెందిన ఉమాపతి, నిర్మల దంపతులు వారి స్నేహితులు కలిసి కొంత మొత్తం సేకరించారు. ఆ విధంగా సేకరించిన రూ.35వేలు గురువారం బాధితులకు అందించారు. కార్యక్రమంలో దాలయ్య, కిరణ్ కుమార్, ఉమాపతి పాల్గొన్నారు.

క్యాబేజీ రైతుల కన్నీరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

కార్తీక మాసంలో డిమాండ్ ఉన్న కూరగాయల సాగు క్యాబేజీ. మరికొన్ని రోజుల్లో రైతు చేతికి అందాల్సిన ఈ పంట మొంథా తుపాను కారణంగా కురిసిన వర్షాలకు కుళ్లి పోతుంది. శ్రీకాకుళం పట్టణానికి సమీపంలో ఉన్న ఎచ్చెర్ల మండలంతో పాటు, నియోజకవర్గంలోని లావేరు, జి.సిగడాం, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో క్యాబేజీ సాగు విస్తారంగా చేస్తున్నారు. ఎకరాకు రూ.50 వేలు వరకు పెట్టుబడి పెడితే రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు ఆదాయం ధర బట్టి రైతుకు వస్తుంది. ఈ పంట విత్తనం నుంచి ఎరువులు, పురుగుల మందుల రూపంలో ఖర్చుఎక్కువ. మరికొన్ని రోజుల్లో పంట చేతికి వస్తుందన్న సమయంలో వర్షాలు శాపంగా మారాయి. దీంతో పంట కుళ్లి పోతుంది. వేలల్లో రైతులు పెట్టుబడి కోల్పోయే పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట సాగులో నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నా గత నాలుగు రోజులుగా


కేశవరావుపేటలో కుళ్లిపోతున్న క్యాబేజీ పంట

కురుస్తున్న వర్షాలు కారణంగా పంట కుళ్లిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధానంగా ఎచ్చెర్ల, కేశవరావుపేట, ఎస్ఎం పురం పేట, ఫరీదుపేట వంటి ప్రాంతాల్లో ఎక్కువగా క్యాబేజీ పంట సాగు చేశారు. ఈ ఏడాది మాత్రం వాతావరణం అనుకూలించక తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులకు ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా యువజనోత్సవ పోటీలు

వజ్రపుకొత్తూరు: మండలంలోని గోవిందపురం-పూండి ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మండలస్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించామని ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్ అన్నారు. గోవిదంపురం, వజ్రపుకొత్తూరు ప్లస్ టూ, సాయివినీత్ కళాశాలల విద్యార్థులకు జానపద నృత్యం, జానపద పాటలు, ప్రసంగ పోటీ, పెయింటింగ్ వివిధ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామివివేకానంద జయంతిని పురస్కరించికొని ప్రభుత్వం జాతీయ యువజనోత్సవాలను వచ్చే ఏడాది జనవరి 12న న్యూఢిల్లీలో నిర్వహిస్తారని అన్నారు. జిల్లాస్థాయిలో మొదటి బహుమతి పొందిన వారికి, రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి పొందినవారికి జాతీయ యువజనోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీలను విద్యార్థులకు ఎంపిక చేసి జిల్లాస్థాయిలో పంపిస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ కేశవరావు, ఎన్ఎస్ఎస్ పిఒ రూపు సుందర్, అధ్యాపకులు జాన్సీ, రాంబాబు పాల్గొన్నారు.